## క్లుప్తంగా

### 12న పానగల్ గంగమ్మ జాతర

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని పానగల్‌లో వెలసిన గంగమ్మ తల్లి జాతర 12వ తేదీ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 9న ఆదివారం చాటింపు, 11న గంగమ్మ నిలుపుదల, 12న గంగమ్మ నిమజ్జనం జరుగుతుందని చెప్పారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. జాతరకు అవసరమయ్యే ఏర్పాట్లు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

### మండలానికి చేరిన నోటు పుస్తకాలు



లారీ నుంచి నోటుపుస్తకాలు దించుతున్న ఎంఈఓ దయాకర రావు, సీఆర్పీలు

**ఏర్పేడు:** ప్రభుత్వం నుంచి 2024–25 నూతన విద్యా సంవత్సరానికిగాను శుక్రవారం మండలానికి నోటు పుస్తకాలు చేరినట్లు ఎంఈఓ–2 దయాకరరావు తెలిపారు. మండలంలోని 6 ప్రాథమికోన్నత, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 3,627 మంది విద్యార్థులకుగాను 26,588 నోట్ పుస్తకాలు చేరినట్లు చెప్పారు. వీటిని ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గదుల్లో నిల్వచేసి త్వరలో ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు వెంకటముని, మునీశ్వర్, సురేష్, మురళి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### గంగమ్మకు సారె



గంగమ్మ తల్లికి సారెను తీసుకువస్తున్న కార్పొరేటర్ ప్రవల్లికారెడ్డి

**తిరుపతి కల్చరల్:** గంగ జాతర సందర్భంగా నగరంలోని 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మకు సాంప్రదాయ సారెను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. 11వ డివిజన్‌లోని కార్పొరేటర్ నివాసంలో అమ్మవారి సారెకు పూజలు నిర్వహించి అక్కడి నుంచి డప్పులు, దరువులతో గంగమ్మ ఆలయానికి ఊరేగింపుగా విచ్చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరను పురస్కరించుకొని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ వేర్వేరుగా ఆలయానికి విచ్చేసి శ్రీతాతయ్యగుంట గంగమ్మని దర్శించుకొని పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

### చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

**తిరుపతి లీగల్:** చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి రూరల్, అవిలాల, ధనలక్ష్మి నగర్‌కు చెంది, స్థానిక ఎస్పీ ఆఫీసులో ఉద్యోగిగా ఉన్న షేక్ మహమ్మద్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరఫు న్యాయవాది పులికొండ బాలాజీ తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతి, జీవకోన, అరుణోదయ నగర్‌కు చెందిన బి.రామమూర్తి వద్ద మహమ్మద్ అలీ 2020 సెప్టెంబర్ 10వ తేదీన 10 లక్షల రూపాయలను అప్పుగా తీసుకొని ప్రోనోటు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అతను 2021 సెప్టెంబర్ 23వ తేదీన రామమూర్తికి ఓ చెక్కును ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో అతను షేక్ మహమ్మద్ అలీపై కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించి షేక్ మహమ్మద్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే పది లక్షల రూపాయల చెక్కు సొమ్మును పరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

### కృష్ణస్వామిరాజుకు దేవమ్మ బాలల కథా పురస్కారం

**తిరుపతి కల్చరల్:** ఆర్‌సీ కృష్ణస్వామిరాజు రచించిన కార్వేటినగరం కథలు పుస్తకానికి పలమనేరు శివేగారి దేవమ్మ బాలల కథా పురస్కారం లభించింది. ఈ మేరకు బాలసాహిత్యాన్ని ప్రోత్సహించాలన్న సంకల్పంతో ప్రతి ఏటా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకుడు కేవీ మేఘనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ పుస్తకంలోని కథలన్నీ భిన్న నేపథ్యాలతో, చక్కటి కొసమెరుపులతో, పిల్లల్ని ఆకర్షించే బొమ్మలతో నిండి ఉన్నాయి. తిరుపతికి చెందిన రచయిత ఆర్‌సీ కృష్ణస్వామి రాజు ఇప్పటికే 150 పిల్లల కథలు రాశారు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన ఈ కథలన్నింటినీ రచయిత రాజుగారి కథలు, రాణి గారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు అనే నాలుగు సంపుటాలుగా వెలువరించారు. వీటిలోని చాలా కథలు ఆలిండియా రేడియోలో పిల్లల కార్యక్రమంలో ప్రసారమయ్యాయి. ఈ పుస్తకంలోని అనేక కథల్లో పాత చిత్తూరు జిల్లా ప్రాంతాలు, విశేషాలు, చరిత్ర నేపథ్యాలు జానపద విశేషాలు విరివిగా కనిపిస్తాయి. ఈ కథా సంపుటాల పోటీకి న్యాయ నిర్ణేతలుగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డీకే.చదువుల బాబు, బాలసాహిత్య పరిషత్ కోశాధికారి పైడి మర్రి రామకృష్ణ వ్యవహరించారు.

# గ్రంథాలయానికి మహర్దశ

- స్వర్ణముఖి తీరాన కొత్త భవనం
- పాఠకులకు సౌకర్యవంతం



నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనం

**శ్రీకాళహస్తి:** పట్టణానికి సంబంధించి ఓ గ్రంథాలయానికి సొంత భవనం లేదు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని వసతులతో కూడిన డిజిటల్ లైబ్రరీ శ్రీకారం చుట్టారు. రూ.65 లక్షల నిధులతో యుద్ధ ప్రాతిపదికన స్వర్ణముఖి నది తీరాన ఒకటో గ్రేడ్ శాఖ గ్రంథాలయాన్ని నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. గత 15 ఏళ్లుగా ముక్కంటి ఆలయానికి సమీపంలోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయం. చాలీచాలని గదులతో పుస్తక ప్రియులకు ఇబ్బంది కలిగించే ఓ ఇరుకు భవనంలో అవసరం పడేవారు. అది కూడా మొదటి అంతస్తులో ఉండడం వల్ల దివ్యాంగులు, వృద్ధులు వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి. సాంకేతికత పెరుగుతున్నా ఇప్పటికీ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివే వారి సంఖ్య మాత్రం అలాగే ఉంటోంది. ప్రధానంగా వృద్ధులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు, నవలలు చదివే అలవాటు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయ కొత్త భవనం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చొరవతో పూర్తయింది.

**గ్రంథాలయానికి ఆదరణ ఘనం**

పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి పట్టణంలో 1961లో ప్రభుత్వం జిల్లా గ్రంథాలయాల సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుత పట్టణ జనాభా సుమారు లక్ష. పట్టణ ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే వారితో ఇక్కడి గ్రంథాలయం ఎప్పుడూ సందడిగా ఉంటుంది. అందులోనూ ముక్కంటి ఆలయానికి దగ్గరగా ఉండడంతో దర్శనార్థం వచ్చే భక్తులు కాస్తంత సమయం ఇక్కడ దినపత్రికలు చదువుకుంటున్నారు.

| | |
|---|---|
| గ్రంథాలయం స్థాయి : | గ్రేడ్–1 |
| రోజు వారీ పాఠకులు : | 150 మందికిపైగా |
| పుస్తకాలు అద్దెకు తీసుకునే వాళ్లు : | 25 మందికి పైగా |
| పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత : | 40 నుంచి 50 |
| సభ్యుల సంఖ్య : | 19,200 మంది |
| పుస్తకాల డిపాజిటర్లు : | 2800 మంది |

**అవస్థలకు చరమగీతం**

ఏళ్ల తరబడి అద్దె భవనంలో కొనసాగిన గ్రంథాలయంలో అన్నీ సమస్యలే. ఈ సమస్యలకు బియ్యపు మధుసూదన్ రెడ్డి చరమగీతం పాడుతూ బీపీ అగ్రహారంలోని ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయం పక్కన స్వర్ణముఖి తీరాన నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.65 లక్షల వ్యయంతో ఈ పనులు పూర్తయ్యాయి. వృద్ధులు, దివ్యాంగులు ఇక్కడ పుస్తక పఠనం చేసుకునేందుకు వీలుగా పక్కా ప్రణాళికలతో నిర్మాణం చేశారు. స్థానిక ప్రజలకు అత్యాధునిక సాంకేతిక వసతి కలిగిన గ్రంథాలయం అందుబాటులోనికి వచ్చింది. అందులోనూ జడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామీణ బస్టాండు ఇలా అన్నింటికీ దగ్గర ఉండడంతో ఈ గ్రంథాలయం ఎక్కువ మందికి ప్రయోజనకరంగా ఉండనుంది.

# రక్తపోటుపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గుణశేఖర్

**సత్యవేడు:** ప్రపంచ రక్తపోటు దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యశాలలో రక్తపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గుణశేఖర్ మాట్లాడారు. రక్తపోటు, దానికి కారణాలు, లక్షణాలు, చికిత్స , నివారణ చర్యల గురించి రోగులకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ బీపీ పరీక్షలు చేయించుకుని జీవనశైలిలో తగు మార్పులు చేసుకోవాలని సూచించారు. రక్తపోటును అశ్రద్ధ చేస్తే గుండె, మెదడు, మూత్రపిండాలు, ఇతర తీవ్రమైన వ్యాధుల బారినపడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, ధ్యానం చేస్తే ఒత్తిడిని అధిగమించి రక్తపోటు బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, మురళి, ఏఎన్‌ఎంలు, నర్సులు, రోగులు పాల్గొన్నారు.

# ఊరందూరులో బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం నుంచి జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి 28వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలు, అక్కడ ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి భక్తులకు ఉచిత ప్రసాదాలను కూడా అందజేస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, బాలాజీ, మురళి, లక్ష్మయ్య, సుదర్శన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణం, 23న గరుడ సేవ, 24న కల్యాణోత్సవం, గజవాహన సేవ, 25న వసంతోత్సవం, రాత్రి రథోత్సవం, 26న రాత్రి పల్లకీసేవ, 27న పార్వేట ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, 28న శాంతి అభిషేకం, రాత్రి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# రేణిగుంటలో కుండపోత



రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వర్షపునీటిలోనే వెళుతున్న ప్రయాణికులు

**రేణిగుంట:** మండువేసవి తాపానికి కాస్త ఉపశమనమిస్తూ రేణిగుంటలో కుండపోతలా వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు భానుడు నిప్పులు కురిపించాడు. సాయంత్రానికల్లా ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా అరగంట పాటు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. వర్షపునీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగునీటి కాల్వలు రోడ్లపైకి పొంగిపొర్లాయి. దీంతో ఇన్నాళ్లు వేసవితాపంతో అల్లాడిన ప్రజానీకం చల్లగాలులు పీలుస్తూ ఆహ్లాదకరమైన అనుభూతిని పొందుతున్నారు.

**వర్షం కురిస్తే రైల్వే ప్రయాణికులకు కష్టం**

రేణిగుంటలో రైల్వేస్టేషన్ బయట ప్రాంగణం చిన్నపాటి వర్షానికి కూడా మడుగును తలపిస్తూ అటు వెళ్లే రైల్వే ప్రయాణికులు ఈదుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. ఇక్కడ వర్షపునీరు ఎటువైపు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతుంది. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా ఇటు రైల్వే అధికారులు కానీ, అటు పంచాయతీ పాలకులు కానీ పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో వర్షం కురిస్తే ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికుల అగచాట్లు వర్ణనాతీతం. ఆ నీటిలోనే నడుస్తూ రైల్వే స్టేషన్‌కు చేరుకోవడానికి వారంతా ఆపసోపాలు పడ్డారు. ఇక్కడ వర్షం కురిసిన ప్రతిసారీ ఇది పరిపాటిగా మారుతోంది. రేణిగుంట రైల్వే జంక్షన్ కావడంతో ఇక్కడికి దేశ నలుమూలల నుంచి అత్యధిక రైళ్లు, యాత్రికులు అధిక సంఖ్యలో వస్తుంటారు. రైలు దిగి బయటకు రాగానే వారికి ఇలాంటి అనూహ్య అనుభవం ఎదురుకావడంతో నిట్టూరుస్తున్నారు.





రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, పాంచాలినగర్‌లో రోడ్డుపై వరదనీరు

# గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరమేదీ?



వేసవి శిక్షణ తరగతులు నిర్వహించక తాళం వేసిన ఉన్న సత్యవేడు గ్రంథాలయం

**సత్యవేడు:** రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 15 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు మొదలయ్యాయి. పలు చోట్ల రెండు మూడు రోజులుగా శిబిరాల్లో చిత్రలేఖనం, మ్యూజిక్, క్యారమ్స్, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చదివించడం, గేమ్స్..ఇత్యాది అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అయితే నియోజవర్గ కేంద్రంలోని సత్యవేడు గ్రంథాలయంలో ఈ శిబిరం నిర్వహించకపోడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వేసవిలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా క్రమశిక్షణ అలవరచుకోవడం కోసం 10–15 ఏళ్ల విద్యార్థులకు నియోజకవర్గ కేంద్రంలో భవన వసతి ఉన్న గ్రంథాలయంలోనూ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించాలని కోరుతున్నారు.

# రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

**పాకాల:** ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని, దీర్ఘకాలికంగా సంతానం లేని వారికి ఉచిత కన్సల్టేషన్‌తోపాటు స్కానింగ్, వీర్య పరీక్ష ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఐయుఐ, ఐవీఎఫ్ పరీక్షలపై 50 శాతం రాయితీ ఉన్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చెన్నయ్ శంకర నేత్రాలయం ఆస్పత్రి వారి మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోనే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడే వారు ఆధార్‌కార్డుతో హాజరవ్వాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు.

# అధికారుల కోసం పడిగాపులు

- ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు
- ఎన్నికలు ముగిసినా విధులకు హాజరుకాని అధికారులు

**బుచ్చినాయుడుకండ్రిగ:** సార్వత్రిక ఎన్నికలు ముగిసినా స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్, ఏఈలు, సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో చెట్ల కింద ప్రజలు పడిగాపులు కాశారు. తహసీల్దారు, ఎంపీడీఓ లేకపోవడంతోపాటు సిబ్బంది సైతం విధులకు హాజరుకాలేదు. రెండు నెలలుగా ఎన్నికలపై సాకు చెప్పి పనులు చేయలేదని, తీరా ఎన్నికలు ముగిసినా అధికారులు సక్రమంగా కార్యాలయాలకు రావడం లేదని, బయోమెట్రిక్ పద్ధతి ఉన్నా ఫలితం లేకుండాపోతోందని ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాలకు అధికారులు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




మూతపడి ఉన్న హౌసింగ్ కార్యాలయం, ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీఓ కుర్చీ

### ఆగమోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం

**శ్రీకాళహస్తి:** జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం చిన్నకొట్టాయి ఉత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. మొదట స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని విశేషంగా అలంకరించారు. చతుర్వేద పారాయణం, మంత్రపుష్పం, నైవేద్యం, దీపారాధన, హారతి నిర్వహించారు. అనంతరం ఆలయంలోనే స్వామి అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వరరావుతోపాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిప్రపత్తులతో ముత్యాలమ్మ కొలుపు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు దివ్య, కిషోర్



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

**పిచ్చాటూరు:** మండలంలో కీళపూడిలోని ముత్యాలయ్య ఆలయంలో కొలుపు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయ ప్రాంగణంలో నెల్లూరుకు చెందిన వైద్యులు డాక్టర్ వి.దివ్య, డాక్టర్ ఎస్.కిషోర్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం కంకణ భక్తుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి ముత్యాలయ్య సమేత ముత్యాలమ్మ గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పాలు పద్మనాభం తెలిపారు. కొలుపు ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

# హంస వాహనంపై గోవిందుని వైభవం

**తిరుపతి కల్చరల్:** శ్రీగోవిందరాజ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి స్వామివారు సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై కొలువై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటల స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది. వాహనం ముందు వృషభాలు, అశ్వాలు, గజరాజులు నడుస్తుండగా భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికి స్వామివారిని దర్శించుకున్నారు. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి చిన్నశేష వాహన సేవ వేడుకగా సాగింది. వాహన సేవలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో స్వామివారిని కీర్తించారు. అనంతరం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, భక్తులు పాల్గొన్నారు.




స్వామివారి వాహన సేవలో చెక్కభజనలు, కోలాటాలతో ఆకట్టుకుంటున్న కళాకారులు



హంస వాహనంపై ఊరేగుతూ దర్శనమిస్తున్న శ్రీగోవిందరాజస్వామి